# మల్లెలు

నవులూరి వెంకటేశ్వరరావు




నేలమీద ధూళి రేగుతూంది ... ఆకాశం నిర్మలంగా ఉంది. తీవ్రత తగ్గిపోయిన ఆకాశం అంచుకి జారిపోతున్నాడు సూర్యుడు [illegible] ఎక్కడో [illegible]

“మల్లెపూలు, మల్లెపూలు, తాజా సరుకు. మూర పావలా” అన్నాడు. అన్న తర్వాత పొడి నాలుకను ఎండిన పెదాల చుట్టూ తిప్పాడు, తేమ గురించి.

పక్కనున్న కాలువలో దోమలు [illegible]లు [illegible]కుంటున్నాయి, ఒళ్ళు విరుచుకుంటూ, చీకటి ఆరంభమవడం చూసి.

పోలీసు విజిల్ ఊదాడు. విజిల్ పలికింది కారుక్రింద పడ్డ పసిబిడ్డ ఏడుపులా. నోట్లోంచి విజిల్ తీసి

“వన్ వే ట్రాఫిక్కని తెలియదండీ” అన్నాడు గొడుగు క్రింద నుంచి స్కూటరు దగ్గరికొస్తూ. స్కూటరు దిగి, [illegible]ళ్ళించి, స్కూటర్ వాలా వెళ్ళిపోయాడు.

"మల్లెలు, మల్లెలు. ఇప్పుడే విచ్చిన మల్లెలు" అన్నాడు మల్లీ దుర్గారావు.

ఎదురుగా ఉన్న లాటరీ టిక్కెట్ల షాపులో టేప్‌రికార్డరు ఎన్నిసార్లయినా వేసుకోవచ్చు, సులభ ప్రచార సాధనం— సులభ సంపాదనా మార్గానికి.

"మూర ఎంత?" ఆమె అడిగింది. ఆమె సన్నగా ఉంది. అతను లావుగా ఉన్నాడు. అతను రెండు కాళ్ళూ నేలను తన్నిపట్టి, స్కూటర్ని ఆపుచేసి కూర్చున్నాడు. ఆమె దిగి, నిలబడి ఉంది.

"మూర పావలా."

"పది పైసల కిస్తావా?"

"ఇరవై పైసలకి తక్కువ లేదమ్మా."

మూడు మూరలు తీసుకుంది. తలలో పెట్టుకుంది. అతను డబ్బు తీసి ఇచ్చాడు. "జీతంలో సగం పూలకే ఖర్చయేట్టుందే" అన్నాడతను. "సరేలెండి. ఈ పూలు కేవలం నా గురించే కొంటున్నట్లు, మీ స్వార్థం అసలే లేనట్లు మాట్లాడుతున్నారు" అంది. స్కూటరు వెళ్ళిపోయింది.

"శేరు రూపాయి. మల్లెపూలు, మల్లెపూలు."

ముసలాడు కళ్ళు చికిలించి చూస్తున్నాడు. అవతలకి దాటాలని ప్రయత్నం. సిటీ బస్సులు, వాటి హారన్ల యుద్ధ భేరులలా మ్రోగి కర్ణభేరులని బద్దలు కొడుతున్నాయి. ఈ జీవిత కాలంలో అవతలకి వెళ్ళలేనేమో అనుకున్నాడు.

దుర్గారావు మెడలో వేలాడుతున్న తువ్వాలుతో మొహం, కళ్ళూ తుడుచుకున్నాడు. ఒళ్ళంతా ధూళి. చొక్కా తడిసిపోయింది. వీపుకి అంటుకుపోయింది. ముసలాయన ఇంకా రోడ్డు దాటలేదు. అతనికేసి చూశాడు. తన తండ్రి గుర్తుకొచ్చాడు.

ఆఖరికి తండ్రి, నములుతున్నట్లు నోటిని ఆడిస్తూ, మోర ఎత్తి, కళ్ళు చికిలిస్తూ, అప్పుడప్పుడు దగ్గుతూ, వీధిలోకి చూస్తూ, అరుగు మీద కూర్చుని ఉంటాడు. "దగ్గు ప్రాణం తీస్తోందిరా, దుర్గా" అన్నాడు ప్రొద్దుట తను వస్తున్నప్పుడు. ఆ మాట అంటున్నప్పుడూ దగ్గాడు. "సరేలేవే" అని మొహం చిట్లించుకుని వచ్చేశాడు తను.

ఊపిరి పీల్చుకుని, "కారుచౌక, మూర పావలా, శేరు రూపాయి" అని అరిచాడు.

అవతలి ఫుట్‌పాత్ మీది కుష్టువాడు పుండ్లు కడుక్కుంటున్నాడు. ప్రొద్దుటి నించి ఏడిపించింది చాలక, రాత్రవుతున్నా శత్రువులలా చుట్టుముడుతున్నాయి ఈగలు. ముక్కు పూర్తిగా మాయమయి పోయింది. రెండు పారంగాలు. వాడు పూల వాసన చూడగలడా అన్న అనుమానం వచ్చింది దుర్గారావుకి.

కొత్త జంటలా ఉంది. ఆమె సిగ్గుగా వెనకనే నిలబడింది. ఇతను పర్సు తీశాడు. "ఎన్ని పూలు కావాలో తీసుకో" అన్నాడు. ఆమె ఏమీ మాట్లాడలేదు. "తీసుకోండి బాబూ, రెండుశేర్ల పూలు. ఈ వయసులో కాకపోతే మరెప్పుడు జల్సా" అన్నాడు దుర్గారావు.

"సరేలే" అన్నాడతను ముభావంగా, దుర్గారావు ఆ మాటలు అనడం ఇష్టం లేనట్లుగా. ఒక అర్ధరూపాయి తీసి, "అర్ధశేరు పూలు చాలు" అన్నాడు. కొలిచి, తామరాకులో పొట్లాం కట్టి ఇచ్చాడు పూలు.

చిన్న కుక్కపిల్ల, రోడ్డు దాటుతూంది నిర్భయంగా, అమాయకంగా. సైకిల్ క్రింద పడిపోయింది. పదేళ్ళ కుర్రాడు సైకిల్ మీది నించి పడబోయి నిలదొక్కుకొని వెళ్ళిపోయాడు. "కుయ్, కుయ్" మని కొంతసేపు అరిచి, చిన్నగా కుంటుకుంటూ అవతలికి వెళ్ళిపోయింది తోక ఆడించుకుంటూ, చెవులు కదిలిస్తూ.

ప్రొద్దున్న తను పూల తట్ట పట్టుకుని ఇంటి నించి వస్తుంటే, దుర్గారావు కొడుకు, రెండు పంటలో లాగూ



నాటక సమీక్ష

## 'శ్రీ కృష్ణ జరాసంధ'

ఎక్కడో పరాయి రాష్ట్రంలో ఉండి, ఏ సంవత్సరానికో, అర్ధ సంవత్సరానికో పౌరాణిక నాటకాలు చూడడానికి నోచుకొనేవారికి 'శ్రీకృష్ణ జరాసంధ' మద్రాసులో ప్రదర్శిస్తున్నారన్న వార్త ఉత్సాహాన్ని కలిగించింది.

ఆంధ్రదేశం మంచి నటీనటులను, సాంకేతిక బృందాన్ని వ్యయప్రయాసల కోర్చి తెచ్చుకొని ప్రదర్శించడానికి వచ్చారూ అంటే ఏదో గొప్పగానే చేస్తారు అనిపించింది.

కాని, తీరా నాటకం చూశాక నిరుత్సాహమే కలిగింది. వంద ప్రదర్శనల దాకా తెలుగు ప్రాంతాలలో ఈ షణ్ముఖ నాట్యమండలివారు ఇచ్చారట. అంత అనుభవం తరవాతకూడా ప్రదర్శనం పేలవంగా ఉండడం— మన పౌరాణిక నాటక సమాజాల కృషి ఏ స్థితిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

సాంకేతికంగా నాటకరంగం, సినీ రంగం చాలా ముందుకు వెళ్ళిన మద్రాసు నగరంలో రుక్మిణి పూలు కోయడానికి పూలమాల సిద్ధం చేసుకున్న సజ్జతో రావడం, ఎటూ ఆకర్షించలేని పాట. రూపం, నటన— ప్రేక్షకులకు నవ్వుకోవడానికి బాగుంది.

హత్య గావించబడిన వ్యక్తి తెర పడే లోగానే లేచి పరుగెత్తడంలో వారి రిహార్సల్స్ శ్రద్ధ, నటనానుభవం, దర్శకత్వపు విలువలూ అర్థం చేసుకోవచ్చు. నారదుడు మేఘాలలోంచి వస్తున్నాడని చూపాలని వేసిన పొగ మరీ ఎబ్బెట్టుగా ఉంది.

ఓ మారు రంగారావునీ, మరోమారు గగ్గయ్యనీ, ఓ సారి రామారావునీ అనుకరించాలని అనుకొని ఉన్న స్వంత టాలెంటునూ చూపలేకపోవడంతో అందరిలోనూ కాస్తో కూస్తో పరవాలేదనిపించుకుంటున్న ఆచంట వెంకటరత్నం (జరాసంధుడు) గతంలో 'తులసీ జలంధర' స్థాయిని అందుకోలేకపోయారనిపిస్తుంది.

కర్టెన్లు, సీనులు చాలా బాగున్నాయి. కాని చక్కగా పాడుకుంటూన్న నారదుని పై లైటింగ్ ఎఫెక్ట్ పేర గిరగిరా చక్రాలు తిప్పడం కొత్త టెక్నిక్ ఏమో?

రచన, దర్శకత్వం పి. వి. భద్రం. జరాసంధుడు—ఆచంట వెంకటరత్నం నాయుడు; శ్రీకృష్ణుడు— జె. బసవేశ్వరరావు; నారదుడు కె. జనార్దనరావు; శిశుపాలుడు—కె. ఆనందరావు; భీముడు అక్కల వెంకటేశ్వరరావు నాయుడు; రుక్మి—బి. గోపినాయుడు; గాలవుడు— చోడవరపు అప్పారావు; మాలాకారుడు— గణపవరపు బ్రహ్మాజీరావు; భీష్మకుడు — పి. వి. కృష్ణారావు; రుక్మిణి—శ్రీమతి సునీతాదేవి; కళావతీరాణి — శ్రీమతి సత్యవతి. నిర్వహణ: శ్రీ షణ్ముఖ నాట్యమండలి, తణుకు.

ఏది ఏమనుకున్నా నాటక ప్రదర్శనం పేలవంగా ఉంది. 'కళాసాగర్' వారు వ్యయప్రయాసల కోర్చి, ధనాన్ని వెచ్చించినా, ఫలితం దక్కలేదేమో!

—ఎల్లోరా

చొక్కా లేకుండా ఒక చిన్న కుక్కపిల్లని పొట్టకు కరిపించుకుని ఆడుకుంటున్నాడు. దా[ని] పట్టి పైకెత్తి, "కెవ్వు" మని అది అరుస్తుంటే ఆనందిస్తున్నాడు. తను కేకేసి, "వెధవా! అప్పు పోసుకుని లాగూ చొక్కా వేసుకో. ఛీ, ఇంటికెళ్ళు" అన్నాడు. "నాన్నా, పది పైసాలివ్వూ?" అన్నాడు వాడు కుక్కపిల్ల నొదిలేసి. "సాయంత్రం ఇస్తాగా ఇంటి కెళ్ళు, అమ్మ అప్పచ్చులు చేస్తోంది" అని ఆశపెట్టి పంపించాడు. సినిమాలోలా గుర్రంమీద వెళుతున్నట్టు కుంటు కుంటూ, నోటితో డెక్కల చప్పుడు చేస్తూ వెళ్ళిపోయాడు. 'అది పిల్లల్ని సరిగా చూడదు. ఒక లాగూ చొక్కా వేయడం, స్నానం చేయించటం — ఏవీ చెయ్యదు' అని విసుక్కున్నాడు.

ఇప్పు డనిపిస్తోంది. పిల్లలకి పట్టుమని చిరగని ఒక్క జతా లేదనీ, చిరిగినవే నన్నా రెండు జతలు లేవనీ. ఆకాశంకేసి చూశాడు. మబ్బులు చేరుకుంటున్నాయి. కురవదు కదా అన్న అనుమానం, భయం పట్టుకున్నాయి. కురిస్తే వర్షమంతా ఇంట్లోనే ఉంటుంది. మట్టిగోడలు చెమ్మగిలుతాయి. వర్షం తగ్గినా రెండు రోజుల దాకా తేమగా ఉంటాయి గోడలు. ఉంటున్న ఇంటికి పాతిక రూపాయలు అద్దె. నెలాఖరి రోజే తయారవుతుంటాడు ఇంటి యజమాని, కారా కిళ్లీ బుగ్గన ఉంచుకుని. వాలుకా, కళ్ళూ ఎప్పుడూ ఎర్రగానే ఉంటాయి.

"మనసును మత్తెక్కించే పూలండీ, పూలు. చవక, చాలా చవక" అని అరిచి, లేచి, పాంటు మీదికి మొలతాడు లాక్కుని, తల పైకి తోసుకుని కూర్చున్నాడు.

పదహారేళ్ళ అమ్మాయి కూనిరాగం తీసుకుంటూ వెళుతూంది. తెల్ల పమిట వేసుకుంది. నల్ల పావడా కట్టుకుంది. ఎత్తు మడమల జోళ్ళు వేసుకోవడం మొదటిసారేమో అన్నట్టు జాగ్రత్తగా అడుగు వేసుకుంటూ వెళుతూంది. ఈ అమ్మాయి దుర్గారావు చెల్లెలి మీద రంగు తక్కువ. చెల్లెలు పిల్లల నాడిస్తూనో, బొమ్మల పుస్తకాలు చదువుకుంటూనో, ఇంట్లో ఆ పనీ ఈ పనీ చేస్తూనో — ఆ పనులు చేస్తున్నప్పుడు కూని రాగం తీయటం మాత్రం మరిచిపోకుండా గడుపుతూ ఉంటుంది కాలం— వదినతో సరదాగా పోట్లాడుతూ ఉంటుంది. పిల్లలని కొట్టి, గిల్లి వాళ్ళేడుస్తుంటే మళ్ళీ బుజ్జగిస్తూ ఉంటుంది. పెళ్ళికాని పిల్లకు కాలం ఎలా గడుస్తుంది?

ఎనిమిది గంట లవుతూంది. ఎదురుగా ఉన్న సిందీవాలా స్వీట్లు దుకాణంలో ఈగల్లా మూగి ఉన్నారు జనం. సిందీవాలా వినాయకుడులా ఉన్నాడు. అన్ని పదార్థాలున్నాయి కదా, తిన బుద్ధి కాదా వాడికి? నోరూరదా? వింతగా ఉంటుంది దుర్గారావుకి. దూరానికి కూడా దారపు ఉండ గిరున తిరగడం కనిపిస్తోంది. ఖాళీ అయిన ఒక పళ్ళాన్ని విసిరేశాడు లోపలికి సిందీ వినాయకుడు.

తన ముందు కుప్పగా పోసిన మల్లె పూలు. కళ్ళు చెదిరే తెల్లదనం. సువాసన.

ఒక తెల్లటి కుర్రాడు, ఎర్రటి అమ్మాయి వస్తూ ఉంటారు. ఒక నాడు — నెలా పదిహేను రోజులనాడు— తన దగ్గర కొన్నాడు ఆ కుర్రాడు, ఒక్కడే. "ఈ పూలన్నీ ఎంత కిస్తావో చెప్పు" అని అడిగాడు. "ఏం బాబూ, అన్ని పూలూ బేరమాడుతున్నారేం?" అని అడిగాడు తను. సిగ్గుగా నవ్వి, "మా పెళ్ళి నిన్ననే అయిందయ్యా. మొదటి రాత్రి" అన్నాడు. తను సంతోషంగా— "ఎంతో కొంతిచ్చి తీసుకెళ్ళండి, బాబూ" అన్నాడు. అతను పది రూపాయల నోటిచ్చి పూలన్నీ (తట్టతోసహా) రిక్షాలో పెట్టించుకుని వెళ్ళిపోయాడు. అతనికి మల్లెపూలంటే ఇష్టం. పెళ్ళయి నది మొదలు రోజూ ఇద్దరూ వచ్చి పూలు కొనుక్కు వెళుతుంటారు.

చీకటి చిక్కబడుతున్నా నియాన్ లైట్ల వెలుగు పరిదాపులలోనికి రావడం లేదు. కాలం తెలియదు. పూలు రేపటికి వాడిపోతాయేమో? డబ్బాలోనించి నీళ్ళు తీసి చల్లాడు. తడి గుడ్డ కప్పాడు. తామరాకులు పేర్చాడు. ఓపిక తెచ్చుకున్న అరుపు — "మల్లెలు. ఇప్పుడే విరిసిన మల్లెలు. అతి చౌక. ఆలసించిన ఆశాభంగం" అని పక్కకి తిరిగి కాండ్రించి ఉమ్మాడు.

ప్రొద్దున్న ఎనిమిది గంటలకల్లా కూర్చుంటే రాత్రి తొమ్మిది దాటేదాకా ఇదే పని. పన్నెండు గంటలకు ఇంటికెళితే మధ్యాహ్నం మూడుదాకా విశ్రాంతి.

రోడ్డుమీద రేగే దుమ్ము లోనించి దూసుకుపోతుంది కేక. అమ్మిన దానిలో సగం లాభం. మిగతాది తరవాత రోజుకి పూలు కొనేందుకు అట్టే పెట్టుకోవాలి. నెలలోని వారాలపై, తారీఖులపై అమ్మకం ఆధారపడి ఉంటుంది.

అరిచి అరిచి చెమటలు పడుతుంది శరీరం. ఆరిపోతుంది. మళ్ళీ మామూలే. తలనిండా, మొహం నిండా దుమ్ము.

మనుషులు పలచబడ్డారు. తామరాకులు తట్టలో పూలపై పరిచాడు. బ్లేడు ముక్క ఒక మూల ఉంచాడు. తడిగుడ్డతో ముఖం తుడుచుకుని, క్రింద వేసుకున్న పట్టను తట్టలో వేసుకుని బయలుదేరాడు. పూలు కొన్ని ఉంటాయి, స్త్రీయని తలుచుకుంటే నవ్వొచ్చింది. అలసటవల్ల కళ్ళు మూసు కుని రోడ్డుమీదే పడుకోవాలనిపిస్తోంది.

ఇంటికొచ్చాడు. ఒళ్ళు నొప్పిగా ఉంది. వేడినీళ్ళు పెట్టి ఉంచింది కాంతం. వీపు రుద్దించుకుని నీళ్ళు పోసుకున్నాడు. తర్వాత తిండి తినడం అయింది. పదిన్నర అయి ఉంటుంది. వరండాలో మంచం వేసింది కాంతం. అది ఒక గది, చిన్న వరండా, పెరడు ఉన్న ఇల్లు. గదికి మధ్యగా తడిక ఉంది. ఒక వైపు వంట గదిగా, మరొక వైపు పడక గదిగా ఉపయోగిస్తున్నారు. ఇంట్లో తండ్రి, చెల్లెలు పడుకుంటారు. కాంతం, దుర్గారావు వరండాలో పడుకుంటారు. వాళ్ళు బయట పడుకుంటే, వీళ్ళు ఇంట్లో. పిల్లలు వాళ్ళ అత్త దగ్గర, తాత దగ్గర చోటుచేసుకుని నిద్రపోతున్నారు. అంతా నిశ్శబ్దంగా ఉంది.

మంచం మీద కూర్చుని బీడీ ముట్టించాడు దుర్గారావు. కాంతం వచ్చి పక్కనే కూర్చుంది. పిల్లలు చేసిన చిలిపి పనులు పూసగుచ్చినట్టు చెబుతూంది. చేపకూర లేదని ముసలాయన సరిగా అన్నం తినలేదని చెప్పింది. బీడీ విసిరేశాడు. మంచంపై వాలాడు. కాంతం పక్కనే పడుకుంది. మీద చెయ్యేసి దగ్గరగా లాక్కున్నాడు. చీకటిగా ఉంది. "ఈ సంవత్సరం చలి అప్పుడే ప్రాణం తీయడం మొదలెట్టింది" అన్నాడు ఆమె చెవిలో. చిన్నగా నవ్వింది. పలు వరస తళుక్కుమంది. జుత్తులోకి చెయ్యి పోనిచ్చాడు. అటు తిరిగి పడుకుంది. కొప్పులో మల్లెపూలు. అంత చీకటిలోనూ కొద్ది క్షణాల పాటు తెల్లగా కనుపించాయి. మొహానికి మెత్తగా తగిలాయి. ఎక్కడినుంచో అలసట దొంగ పిల్లిలా దూకింది అతని మీద. అంతా చీకటి మొహం మరీ నల్లగా మార్చుకున్నట్లుం దిప్పుడు. కళ్ళకేమీ కనిపించడం లేదు—చివరకు పూల తెల్లదనం కూడా. మనసులో ఏదో కన్ను తెరుచుకున్నట్లుంది. పొగమంచు కనిపిస్తోంది. బట్టలు లేకుండా కుక్కపిల్లతో ఆడుకుంటున్న కొడుకు, దగ్గుతున్న తండ్రి, చెమ్మగిల్లే పాతకొంప యజమాని, పెళ్ళిగాని చెల్లెలు—వరసగా ఆ పొగమంచులో కనుపిస్తున్నారు. సర్దుకున్న మనసులో దుమ్మూ ధూళీ రేస్తోంది. కార్లు, తదితర వాహనాలు చేసే శబ్దాలు, వాటిని మించి అతని గొంతు వినిపిస్తున్నాయి. చెమట కంపు గుప్పుమన్నట్లనిపిస్తోంది.

పూలు తీసి గిరాటేశాడు. ఆమె ఇటు వైపు తిరిగి, "ఏం?" అంది. "ఏం లేదు" అని తన నోటితో ఆమె పెదా లందుకున్నాడు. ★

# ఆలోచనాలోచనాలు

## డాక్టర్ దాశరథి

ఆకాశ కేశపాశిని ఆప్యాయంగా దువ్వుతున్న
ఆ అతి కోమలాంగుళులు ఎవ్వరివి?
అంభోధర యవనికలనుండి నవ్వుతున్న
ఆ గోషా యోషామణుల ముఖబింబా లెక్కడివి?

రాత్రి నీలాంబరాంచలాలలో
రజత చంద్రరేఖ దిద్దే చిత్రకారు డెవ్వడు?
నైలునదీ జలధారలలో
నాట్యమాడే ఓడల మేడ లెక్కడివి?

ఇంక గగనం నుంచి అగ్ని వర్షం కురియదని
ఎంతో ధైర్యంతో వీథుల్లో తిరుగాడే దెక్కడ?
మహాగజం ఓడిపోయిందని హర్షంతో
మైకంలో గెంతుతున్న ఆ మశకం ఎవ్వరు?

రుధిరం త్రాగితే దాహం చల్లారదని తెలుసుకుని
మధుర మధు ధార కోసం వెతికే రక్కసి ఎక్కడ?
లక్షల నక్షత్రాల కుక్షులలో లేని వెలుగు
అక్షరాలలో ఉందని గ్రహించే దెవ్వడు? ★